ఈనాడు
బాపట్ల
బుధవారం అక్టోబరు 23, 2024


## తగ్గిన వరద ప్రవాహం

విజయపురిసౌత్: ఎగువ కృష్ణా పరివాహక ప్రాంతంలో మూడ్రోజులుగా వరద పెరగడంతో 20 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. అయితే మంగళవారం ఎగువన వరద తగ్గుముఖం పట్టడంతో దిగువ జలాశయాలకు నీటిచేరిక తగ్గింది. దీంతో నాగార్జునసాగర్ రెండు గేట్లు అయిదు అడుగులు ఎత్తి 15,948 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 6173, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు 2400, లోలెవల్ కెనాల్‌కు 400, సాగర్ ప్రధాన జలవిద్యుత్తు కేంద్రానికి 29,435 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## ఇదేం దారి.. పడతారు జారి


రాచూరు ప్రధాన రహదారి ఇలా..

భట్టిప్రోలు మండలంలో రాచూరు మారుమూల గ్రామం. గ్రామసభలు జరిగే సమయంలోనే అధికారులు ఆగ్రామానికి వెళుతుంటారు. రహదారి గుంతలమయం కావడంతో ఇటీవల మట్టి పోశారు. కురుస్తున్న వర్షాలకు రహదారి బురదమయమవుతోంది. నిత్యం గ్రామంలోకి ప్రైవేటు పాఠశాలల బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. గ్రామంలోకి బస్సు రాకపోవడంతో ఇతర వాహనాలు ఎక్కి రెండు కిలోమీటర్లు ప్రయాణించి పల్లెకోన గ్రామంలో బస్సులు ఎక్కాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. బురదలో వాహనాలు జారుతుండడంతో ఆటోలు కూడా తమ గ్రామంలోకి రావడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, భట్టిప్రోలు

## వయోవృద్ధుల సంరక్షణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి


కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

**ఈనాడు, అమరావతి:** వయోవృద్ధుల సంరక్షణకు భారత ప్రభుత్వం తీసుకొచ్చిన అనేక పథకాలు, చట్టాలను ప్రభుత్వాలు కఠినంగా అమలు చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. కుటుంబ విలువలు కాపాడుకుంటూనే అనివార్యమైనప్పుడు పెద్దలకు కష్టం రాకుండా కలసికట్టుగా నివసించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామంలో కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ కంఫర్ట్ హోమ్ (శ్రీనిలయం)ను మంగళవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయసు పెరగడమంటే అనుభవం, జ్ఞానం పెరిగిందని గుర్తించాలని యువతకు సూచించారు. సీనియర్ పౌరులందరూ సామూహికంగా నివసించడానికి కేంద్రం ఏర్పాటు చేసుకోవడం మంచిదే అయినా మనం ఎక్కడికి పోతున్నాం.. ఏమైపోతున్నాం. ఇంట్లో ఉండకుండా ఇక్కడ ఉండాల్సిన పరిస్థితి ఏమిటి? ఇంట్లో వాళ్లు ఏమైపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబాలే కాదు. క్రమంగా కుటుంబ వ్యవస్థ లేకుండా పోవడం చాలా బాధాకరమన్నారు. సొంతూరిలో ఉంటూ తల్లిదండ్రులను పిల్లలు దూరం పెట్టడం మంచిది కాదని హితవు పలికారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సానుకూల ఆలోచనలతో ముందుకెళ్లాలన్నారు. అసూయతో శరీరం కరిగిపోయి వయసు పెరిగిపోతుందని ఆయన వ్యాఖ్యానించారు. గతాన్ని, భవిష్యత్తును కలిపే వారధి పెద్దలు. వారధులు సారథులుగా ఉండి కుటుంబాన్ని నడిపించాలని పిలుపునిచ్చారు. పెద్దలను మరచిపోకుండా, వారిపట్ల నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పెద్దరికాన్ని పిల్లలు గౌరవించాలని సూచించారు. పిల్లలు తల్లిదండ్రులను హింసించారని, నిర్లక్ష్యం చేశారని వార్తలు వస్తున్నాయని, భారతీయ సంస్కృతిలో ఇది భాగం కాదని గుర్తు చేశారు. సంపదను ఇతరులకు పంచడంలోనే ఆనందం, సంతృప్తి ఉన్నాయని గుర్తించాలన్నారు. తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, యరపతినేని శ్రీనివాసరావు, కామినేని శ్రీనివాసరావు, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, భాష్యం ప్రవీణ్, గళ్లా మాధవి, నసీర్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## జెట్టీ నిర్మాణ పనులకు మార్గం సుగమం



❖ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖల నుంచి అనుమతులు
❖ నిజాంపట్నం హార్బర్ విస్తరణ పనుల్లో కదలిక

ఈనాడు, బాపట్ల

నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ఫేజ్-2 విస్తరణ పనుల్లో కదలిక వచ్చింది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించటంతో పనుల నిర్వహణకు ఉన్న అడ్డంకులు ఒక్కొటి తొలగి నిర్మాణ పనులు వేగవంతం చేయటానికి మార్గం సుగమమవుతోంది. తాజాగా జెట్టీ విస్తరణ నిర్మాణ పనులు చేపట్టడానికి అవసరమైన రెండున్నర ఎకరాల భూమి కేటాయింపు.. దానికి కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖల నుంచి అనుమతులు వచ్చాయి. దీంతో జెట్టీ నిర్మాణ పనులు వేగవంతమయ్యే అవకాశం ఉంది.

హార్బర్‌లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన భూములపై పునఃపరిశీలించి నివేదిక పంపాలని కేంద్రం కోరింది. గతంలో వంద ఎకరాలు కావాలని ప్రతిపాదించగా దానికి కేంద్రం అభ్యంతరం తెలిపింది. వాస్తవంగా ఎంతభూమి అవసరమో మరోసారి అధ్యయనం చేసి నివేదిక పంపాలని కోరటంతో ఆ పనుల్లో యంత్రాంగం నిమగ్నమైంది.

**గతంలో హడావుడిగా పనులు :** కేంద్ర సాగరమాల ప్రాజెక్టు కింద 2022లో హార్బర్ విస్తరణ, నిర్మాణ పనులకు రూ.451 కోట్లు కేటాయించింది. గతంలో వైకాపా ప్రభుత్వం భూమి లభ్యత, కేంద్ర పర్యావరణ అనుమతులు పొందకుండా హడావుడిగా నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. అవి వైకాపా పాలకుల ప్రచారానికే పరిమితమయ్యాయి. జెట్టీ విస్తరణతో పాటు మౌలిక వసతుల కల్పనకు అవసరమైన రిజర్వు భూమిని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖల నుంచి పొంది పనుల పూర్తికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది.


జెట్టీ వద్ద పడవలు

గత ప్రభుత్వం ఆర్భాటంగా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసింది. ఆపై గుత్తేదారు చేసిన పనులకు బిల్లులు పెండింగ్ పెట్టింది. ఈ క్రమంలోనే ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారసభలో తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు తీరప్రాంత అభివృద్ధి ప్రణాళికలో నిజాంపట్నం హార్బర్ నిర్మాణ పనులను పూర్తిచేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మత్స్యకారుల్లో హార్బర్ నిర్మాణ పనులపై కొంత భరోసా వచ్చింది. ప్రస్తుతం జెట్టీ విస్తరణ పనులకు అవరోధాలు తొలగాయి. జెట్టీ విస్తరణతో హార్బర్‌లో 500కు పైగా పడవలు నిలపొచ్చు. ప్రస్తుతం 80 పడవలకు మాత్రమే స్థలం ఉంది. తుపాను సమయంలో ఇతర ప్రాంతాల నుంచి మత్స్యకారులు ఇక్కడ జెట్టీలో పడవలు నిలపడానికి వస్తున్నారు. వారికి నిరాశే మిగులుతోంది.

### 99 ఎకరాలపై పునఃపరిశీలనకు ఆదేశం

హార్బర్ విస్తరణకు 99 ఎకరాల రిజర్వు అటవీభూములు అవసరమని ప్రతిపాదనలు పంపారు. అయితే అంత మేర అవసరమో లేదో పునఃపరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని కేంద్రం రాష్ట్రాన్ని కోరింది. ప్రస్తుతం దానిపై యంత్రాంగం దృష్టిసారించింది. స్థానికంగా డీజిల్ బంక్, చేపల వేలం పాట షెడ్ ఫ్లాట్‌ఫాం, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, మత్స్యకారుల విశ్రాంతి గృహాలు, బోట్ ల్యాండింగ్, నెట్ షెడ్, వలలు అల్లుకునే షెడ్లు, చేపలు ఆరబెట్టే షెడ్లు, నిల్వ చేసుకోవటానికి స్టోరేజ్, పడవల మరమ్మతు కేంద్రం తదితర మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. అందుకు 99 ఎకరాల రిజర్వు అటవీభూమి కావాలని గతంలో ప్రతిపాదనలు పంపి ప్రతిగా కేంద్ర అటవీశాఖకు పల్నాడు ప్రాంతంలో రెట్టింపు భూమి ఇస్తామని సూచించింది. అయితే ఆ ప్రతిపాదనలపై తాజాగా నివేదిక కోరిందని అధికారులు తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు అవసరమైన భూమిని కేటాయిస్తే త్వరలోనే పనులు పూర్తిచేసి హార్బర్‌ను అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు. పనుల్లో భాగంగా ఇప్పటి దాకా మొగ వద్ద పూడిక తొలగించారు. సముద్రంలో 1.5 కి.మీ పొడవున కొండరాళ్లతో నిర్మాణ పనులు చేపట్టారు.

## రైతుబజారు సద్వినియోగం చేసుకోవాలి


రైతు నుంచి తేనె కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన, పక్కన జేసీ

**బాపట్ల:** రైతు ఉత్పత్తులు నేరుగా విక్రయించే అవకాశం కల్పిస్తూ పట్టణంలో రైతు బజారును ప్రారంభించినట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలో పురపాలక కూరగాయల మార్కెట్ సమీపంలో రైతుబజారును జేసీ ప్రఖర్‌జైన్‌తో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు అందించటానికి రైతుబజారును రూ.60 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు దీనిని ప్రారంభించకుండా మూలన పెట్టిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు రైతుబజారులో దుకాణాలు కేటాయించి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రైతులు నేరుగా తమ కూరగాయలు, ఆకుకూరలను వినియోగదారులకు విక్రయించి మద్దతు ధర పొందుతారన్నారు. జేసీ ప్రఖర్‌జైన్ మాట్లాడుతూ రైతుబజారును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త శివనారాయణ, మార్కెటింగ్ శాఖ డీడీ [illegible], ఏడీ రమేష్‌బాబు, డీఈ పవన్‌కుమార్, కమిషనర్ రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణం వద్దని ఆందోళన


తిమ్మనపాలెం వద్ద రోడ్డుపై గ్రామస్థుల నిరసన

**తిమ్మనపాలెం (మేదరమెట్ల), న్యూస్‌టుడే:** చర్చి ఎదుట మద్యం దుకాణం ఏర్పాటుకు పనులు ప్రారంభించడంపై గ్రామస్థులో ఆందోళన చేశారు. కొరిశపాడు మండలం తిమ్మనపాలెంలో నాగులుప్పలపాడు రోడ్డులో చర్చి ఉంది. దాని ఎదుట 30 అడుగుల దూరంలో మద్యం దుకాణం ఏర్పాటుకు మంగళవారం పనులు చేపట్టారు. దీంతో చర్చికి వచ్చేవారు, సమీపంలోని గ్రామస్థులు అందరూ అక్కడికి చేరుకుని ఆందోళన చేశారు. చర్చి ఎదుట మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడతారని చర్చి పాస్టర్ తాటిపర్తి యాకోబు తెలిపారు. అధికారులు స్పందించి ఆ ప్రదేశంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆ ప్రదేశంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా పోరాడతామని స్థానిక తెదేపా నాయకులు తెలిపారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల కట్టడి


మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, హాజరైన రేంజ్ పరిధిలోని ఎస్పీలు

**ఈనాడు, అమరావతి:** సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట వేయాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పిలుపునిచ్చారు. కేసుల దర్యాప్తుల్లో సాంకేతికతను జోడిస్తే ఫలితాలు వేరుగా ఉంటాయని చెప్పారు. ఇటీవల బాపట్ల జిల్లా మేదరమెట్ల స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ దారి దోపిడీని కేవలం 48 గంటల్లో ఛేదించడానికి ఆ పరిజ్ఞానమే దోహదపడిందన్నారు. మంగళవారం సాయంత్రం రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్పీలతో ఆయన గుంటూరులోని తన ఛాంబర్‌లో సమీక్షించారు. తెదేపా కేంద్ర కార్యాలయం, చంద్రబాబునాయుడు నివాసంపై గతంలో జరిగిన దాడుల కేసుల పురోగతి, ఆధారాలు ఎలా సేకరించిందీ ఎస్పీలకు వివరించారు. రఘురామకృష్ణరాజు కేసు పురోగతిపైనా చర్చించారు. ఎస్పీలు సతీష్‌కుమార్ కె.శ్రీనివాసరావు, తుషార్ డూడీ, దామోదర్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

**ఐజీ చేసిన సూచనలు... :**
❖ ప్రతి స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కడ ఏ నేరం జరిగినా వెంటనే సీసీ కెమెరాల ద్వారా గుర్తించేలా అవి ఉండాలి.
❖ గతంలో మాదిరి ప్రతీ కానిస్టేబుల్‌కు ఒక ప్రాంతాన్ని దత్తత ఇచ్చి అక్కడ ఏం జరిగినా సమాచారం వచ్చేలా చూడాలి.
❖ రెగ్యులర్ కేసులను పర్యవేక్షిస్తూనే వాటి పెండెన్సీని చాలా వరకు తగ్గించాలి.
❖ రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. ప్రతి వారం కౌన్సెలింగ్ చేస్తూ వారి కదలికల్ని తెలుసుకోవాలి.
❖ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెట్టి విద్వేషాలను రెచ్చగొట్టేవారిని కట్టడి చేయాలి. బాధ్యులను పిలిచి మాట్లాడాలి. రెండోసారి పునరావృతమైతే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాలి
❖ సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఏర్పాట్లు చేయాలి.
❖ గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలకు తావులేకుండా ఉక్కుపాదం మోపాలి. వాటి పర్యవసానాలపై కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి.

## మిర్చి రైతుకు ఎగుమతులే అండ

### నిలకడగా ధరలు

ఈనాడు, అమరావతి


గుంటూరు మిర్చియార్డులో బస్తాలు

విదేశీ ఎగుమతుల కారణంగా మిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం దేశీయంగా గిరాకీ తక్కువగా ఉన్నా.. చైనా, బంగ్లాదేశ్, వియత్నాం, శ్రీలంక, సింగపూర్, మలేసియా తదితర దేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గుంటూరు మిర్చియార్డులో రోజుకు 50 వేలకుపైగానే బస్తాల క్రయవిక్రయాలు నమోదవుతున్నాయి. మరోవైపు పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని పంట దేశీయ అవసరాలకు సరిపోతుందని అంచనా. ఈ దిగుబడుల ప్రభావం మన మార్కెట్‌పై లేదని సంబంధితవర్గాలు విశ్లేషిస్తున్నాయి. దేశీయంగా ఉన్న నిల్వలు, ఎగుమతుల తీరు, నవంబరు నెలాఖరులో వచ్చే కొత్త సరకు పరిమాణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్న వ్యాపారులు కొనుగోళ్లను పెంచారు. ఫలితంగా ధరలు తగ్గకుండా నిలకడగా కొనసాగుతున్నాయి. ధరలు మరింతగా పెరిగేందుకు అవకాశం ఉన్నా.. నాణ్యమైన డీలక్స్ రకాల లభ్యత తక్కువగా ఉండడం అడ్డంకిగా మారింది. గతేడాది నిల్వలను ఇప్పుడు విక్రయిస్తుండడం వల్ల నాణ్యత కొంత తగ్గిందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. కొత్త పంట ఆలస్యం కావడం, ఎగుమతులు ఇదేవిధంగా ఉంటే దీపావళి తరువాత నాణ్యమైన సరకుకు ధర పెరిగే అవకాశం ఉందని మార్కెట్‌వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ప్రస్తుతం డిమాండ్ ఉన్న రకాలు: తేజ, బాడిగ, డీడీ. వీటిని అమ్మడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

**నిల్వలు 60 లక్షల బస్తాలకుపైగానే... :** గుంటూరు పరిసర శీతల గోదాముల్లో 40 లక్షల బస్తాల వరకు మిర్చి నిల్వలున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే 60 లక్షల బస్తాలకుపైగానే నిల్వలున్నాయి. గతంలో ఎన్నడూలేనివిధంగా అక్టోబరు చివరివారం నాటికి పెద్దఎత్తున నిల్వలు ఉండడం ధరలపై ప్రభావం చూపుతోంది. మధ్యప్రదేశ్‌లో ఈసారి రైతులు ఎక్కువగా పచ్చిమిర్చి విక్రయిస్తుండడంతో మార్కెట్‌కు ఎండుమిర్చి రాక ఆలస్యమైంది. ఇప్పుడిప్పుడే అక్కడ రోజుకు 5 వేల నుంచి 7 వేల బస్తాలు వస్తున్నాయి. అక్కడ ఎండుమిర్చి 10 లక్షల నుంచి 12 లక్షల బస్తాలకే పరిమితమవుతుందని అంచనా. ఇది అక్కడి అవసరాలకు సరిపోతుందని అంచనా. మన రాష్ట్రంలో ఈసారి సాగు విస్తీర్ణం తగ్గడం, కొత్త పంటపై ఇంకా అంచనాలు రాలేదు. గుంటూరు మిర్చి యార్డుకు తొలుత సరకు వచ్చేది కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచే. నవంబరు నెలాఖరు నుంచి కొత్త సరకు వస్తుందని అంచనా. కాలువలకు సమృద్ధిగా నీటిని విడుదల చేస్తున్నా.. అధిక వర్షాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల వల్ల కొత్తపంటపై ఇప్పుడే అంచనా వేయలేమని మార్కెట్‌వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

మిర్చి యార్డుకు అక్టోబరు 18న వచ్చిన బస్తాలు 43,523. విక్రయించినవి 50,503 బస్తాలు. నిల్వ 19,806 బస్తాలు. ఆ రోజు రైతులకు లభించిన ధరలు ఇలా..

| రకం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| | (అంకెలు రూపాయల్లో) | |
| 334 | 8,200 | 16,000 |
| నంబరు5 | 8,500 | 16,000 |
| 341 | 9,000 | 16,000 |
| 273 | 12,000 | 13,500 |
| తేజ | 8,000 | 18,500 |
| బాడిగి | 8,500 | 16,500 |
| డీడీ | 9,000 | 16,000 |

## బాలల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** బాలల హక్కులకు భంగం కలిగిస్తే రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చూస్తూ ఊరుకోదని ఆ కమిషన్ సభ్యురాలు పద్మావతి హెచ్చరించారు. చీరాల ప్రాంతంలోని పలు


చీరాల మోడల్ స్కూల్‌లో కాలం చెల్లిన రాగిపిండి ప్యాకెట్లు పరిశీలిస్తున్న పద్మావతి

ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్, కేజీబీవీ వసతి గృహాలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లో అయిదో నెలలో గడువు తీరిన రాగి పిండి ప్యాకెట్లను ఇంకా విద్యార్థులకు ఇవ్వడం, బెడ్లు బాగోకపోవడం, గదులకు తలుపులు సరిగాలేకపోవడం, ఫిర్యాదుల పెట్టె తెరవకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రధానాచార్యులు, ఉప ప్రధానాచార్యులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. కేజీబీవీలో విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనం బాగా లేకపోవడంతో పాటు పరిసరాలు అధ్వానంగా ఉండడాన్ని ఆమె గుర్తించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో 1098 చైల్డ్‌లైన్ నంబరు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ గోపికృష్ణ, ఎంఈవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనరు అబ్దుల్ రషీద్, ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం, జీసీడీవో చారులత ఉన్నారు.

## వయోజనుల అక్షరాస్యత శాతం పెంచాలి

**బాపట్ల:** వయోజనులకు విద్యాబోధన ద్వారా అక్షరాస్యత శాతం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ ప్రఖర్ జైన్ అన్నారు. వయోజన విద్యపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్లో జేసీ ఛాంబర్లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉల్లాస్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. అక్షరాస్యులు కాని మహిళలను గుర్తించాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 15,268 మంది నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. విద్యావంతులైన వారిని వాలంటీర్ ఉపాధ్యాయులుగా నియమించాలన్నారు. ప్రతి వాలంటీర్ పది మంది అభ్యాసకులను మ్యాపింగ్ చేసి ఉల్లాస్ యాప్‌లో పొందుపరచాలన్నారు. వయోజనులకు ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల పాటు అక్షరాభ్యాసం చేయాలన్నారు. వయోజన విద్య ఉప సంచాలకులు బి.జగన్‌మోహన్‌రెడ్డి, నోడల్ అధికారి మధుసూదన్‌రావు, డీపీవో ప్రభాకర్, ఐడీడీఎస్ పీడీ ఉమా, డీఎల్‌డీవో సువార్త, పర్యవేక్షకులు మనోరంజన్, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అరాచక పాలనకు ఓటుతో స్వస్తి

### అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కళాశాల హైదరాబాద్ డీజీ నిమ్మగడ్డ


సెమినార్‌లో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్, చిత్రంలో ఆచార్య హరగోపాల్ తదితరులు

**బాపట్ల, న్యూస్‌టుడే:** ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున ఓట్లు వేసి గత ప్రభుత్వ అరాచక పాలనకు స్వస్తి పలికారని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కళాశాల హైదరాబాద్ డీజీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అన్నారు. ఎస్ఆర్ శంకరన్ స్మారక ట్రస్టు, బాపట్ల పౌర సమాఖ్య ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం- సుపరిపాలన' అనే అంశంపై సెమినార్‌ను స్థానిక ప్రైవేటు హోటల్‌లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలు సహించరన్నారు. గత ఎన్నికల్లో ఇతర రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ పోలింగ్ శాతం నమోదు కావటం అందుకు నిదర్శనమన్నారు. ఇతర రాష్ట్రాల్లో 66 శాతం పోలింగ్ జరిగితే ఏపీలో 82 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. నియంతృత్వ పాలన సాగిస్తే ప్రజలు ఓటు ద్వారా పాలకులను మార్చివేస్తారన్నారు. ప్రజలు సమస్యలపై సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్సస్ రీడ్రెస్ అండ్ మోనిటరింగ్ సిస్టమ్(సీపీగ్రామ్స్) ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. 24 గంటలు పని చేసే ఈ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో అన్ని రకాల సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చన్నారు. విశ్రాంత ఐఏఎస్ ఎస్ఆర్ శంకరన్ నిరుపేదలకు ఏ విధంగా సేవ, సాయం చేయవచ్చో గొప్ప మార్గాన్ని చూపించారన్నారు. ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ పేదల జీవన ప్రమాణాలు మెరుగుకు అహర్నిశలు శ్రమించారన్నారు. ఆయన సేవలను కేంద్రం గుర్తించి పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించినా సున్నితంగా తిరస్కరించారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్.చక్రవర్తి మాట్లాడుతూ శంకరన్ గొప్ప ప్రజాస్వామ్యవాది అన్నారు. దేశవ్యాప్తంగా ఐటీడీఏల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు ఊపిరి పోశారని, వారి జనాభా ప్రాతిపదికన దామాషా పద్ధతిలో రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించటానికి ఉప ప్రణాళికలు రూపకల్పన చేశారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఆర్.సుబ్రహ్మణ్యం, డి.చక్రపాణి ప్రసంగించారు. ట్రస్టు అధ్యక్షుడు కారుమంచి విజయ్‌కుమార్, పౌర సమాఖ్య కార్యదర్శి శరత్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన సమస్యల పరిష్కారానికి వినతి

**చీరాల అర్బన్:** డాక్టరు ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి (వైద్యమిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, మానిటరింగ్ యూనిట్) సిబ్బంది ప్రధాన సమస్యలను పరిష్కరించాలని మంగళవారం చీరాల వచ్చిన ఆ సేవల జిల్లా సమన్వయకర్త డాక్టరు సీహెచ్ ప్రవీణ్ కుమార్‌కి సిబ్బంది వినతిపత్రం అందజేశారు. ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బడుగు రాజు, అన్నంగి రేబికా, రాంబాబు, బోయజ్, ప్రభాకర్, రాజశేఖర్, అనిల్ ఉన్నారు.







# ఉచితం... అక్రమార్కులకు వరం

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే

ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు వరంగా మారింది... మొన్నటి వరకు ఎడ్లబండిపై తీసుకెళ్లడానికి అనుమతి ఇచ్చింది... తాజాగా ట్రాక్టర్లను ఈ జాబితాలోకి తీసుకొస్తూ సాక్షాత్తు ముఖ్యమంత్రి నాలుగు రోజుల క్రితం ప్రకటించారు... ఇంకేముంది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను యథేచ్ఛగా తరలించేస్తున్నారు.... ఫలితంగా రోడ్లపై ఈ ట్రాక్టర్లతో దుమ్ములేస్తోంది ...ఇదే సమయంలో నిబంధనలను ఉల్లంఘించడం ఆందోళన కలిగించే అంశం.

వాగులు, వంకలు, నదుల నుంచి ఇసుక కావాల్సిన వారు ఉచితంగా తీసుకెళ్లవచ్చని సర్కారు ప్రకటించింది. దీనికోసం ఒక్క పైసా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. పేదలను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు సొంతింటి కోసం ఇసుక లేక పనులు ఆగిపోకుండా ఉండాలనే ఉద్దేశంతో తీసుకురాగా అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. చీరాల, వేటపాలెం మండలాల్లో ఎక్కడ వాగులు, నదులు, వంకలు లేవు. అయినా ఇక్కడ ఇసుకను అక్రమార్కులు ప్రైవేట్ భూములు, అసైన్డ్ భూముల నుంచి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మొన్నటి వరకు ట్రాక్టర్ల ద్వారా అర్ధరాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా తరలించే వీరు ఎప్పుడైతే

### దుమ్మురేపుతున్న ఇసుక ట్రాక్టర్లు

ట్రాక్టర్లు వినియోగించవచ్చని ప్రభుత్వం ప్రకటించిందో ఆ రోజు నుంచి పగలు, రాత్రులు తేడా లేకుండా ప్రధానంగా పందిళ్లపల్లి నుంచి అధిక సంఖ్యలో తరలిస్తున్నారు. ఇక పాతచీరాల, దేశాయిపేట, చల్లారెడ్డిపాలెం, బోయినవారిపాలెం ప్రాంతాల్లోనూ అక్రమ తవ్వకాలు



చీరాల-వేటపాలెం బైపాస్ రోడ్డులో వెళుతున్న ఇసుక ట్రాక్టరు

కొనసాగుతున్నాయి. వీరిలో కొంతమందికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో ఇంకేముంది నిర్భయంగా పొక్లెయిన్‌తో ఇసుకను ట్రాక్టర్లలో నింపి పంపిస్తున్నారు. నియోజకవర్గానికి సంబంధంలేని వ్యక్తి ఒకరు దీనివెనుక కీలక పాత్ర పోషించడంతో గతంలో ఇసుక వ్యాపారం చేసిన చాలా మంది గుర్రుగా ఉన్నారు. మొన్నటి వరకు ట్రాక్టరు ఇసుక రూ.4 వేలుపైనే పలికింది. ఇప్పుడు ట్రాక్టర్లు ఎక్కువగా సరఫరా చేయడంతో అది కాస్తా రూ.3 వేలకు తగ్గడంతో భవన యజమానులు మళ్లీ ఈ అవకాశం వస్తుందో లేదో అని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిల్వ చేసుకునే పనిలో పడ్డారు.

### వాగుల్లోనే తవ్వుకోవాలి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాగుల్లో, నదుల్లో మాత్రమే ఇసుక తవ్వుకోవాలి. అదీ కూలీల ద్వారానే ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు నింపుకోవాలి. ఎక్కడ పొక్లెయిన్‌లు వాడకూడదు. ఉచిత ఇసుక విధానంపై ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాబోయే నాలుగు రోజుల్లో దీనికి మరిన్ని సవరణలు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు సొంతభూములు, ఆసైన్డ్‌భూముల్లో ఇసుక తవ్వకాలకు ఎవరైనా దరఖాస్తు చేశారా అనే విషయంపై 'న్యూస్‌టుడే' ఏడీని ప్రశ్నించగా కొల్లూరు మండలంలో 25 ఎకరాల్లో ఇసుక తవ్వకాలకు ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ప్రాంతాల నుంచి ఎవరు దరఖాస్తు చేసుకోలేదని తెలిపారు.

– ఆర్.రాజేష్‌కుమార్, ఏడీ, మైనింగ్ అండ్ జియాలజిస్ట్, బాపట్ల

## అత్యాధునిక వసతులతో సొంతింటి కల సాకారం



దీపారాధన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ఛైర్మన్ గల్లా రామచంద్రరావు

**పట్టాభిపురం, న్యూస్‌టుడే:** అత్యాధునిక వసతులతో ప్రజలకు సొంతింటి కల సాకారం చేస్తున్నామని శ్రీభ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు పేర్కొన్నారు. గుంటూరు రింగ్‌రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శ్రీభ్రమర హౌసింగ్ సంస్థ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు 9,000 మందికి పైగా సొంతింటి కల సాకారం చేశామన్నారు. నిర్మాణ రంగంలో కొత్తదనం సృష్టించాలన్న ఆశయంతో 2015లో శ్రీభ్రమర టౌన్‌షిప్స్‌ను ప్రారంభించామని తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 30కి పైగా అద్భుతమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి అభివృద్ధి చేసి స్థిరాస్తి రంగంలో ప్రత్యేక ముద్ర వేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక సౌకర్యాలతో ప్రాజెక్టులు చేపట్టి నగర జీవనశైలిని సమతుల్యం చేసేందుకు శ్రీభ్రమర కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎం.ఎస్.రాజు, లక్ష్మీపతిరాజు, శైలారెడ్డి, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ, కాకర్ల సతీష్, కమ్మ రవి తదితరులు పాల్గొన్నారు.

## పలు రైళ్ల రద్దు

**గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే:** తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు అవకాశం ఉన్నందున గుంటూరు మీదుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేసినట్లు మండల రైల్వే అధికారి తెలిపారు. ఈనెల 23న సికింద్రాబాద్-భువనేశ్వర్(17016), సిల్చార్-సికింద్రాబాద్(12514), సికింద్రాబాద్-హౌరా(12704), యశ్వంతపూర్-హౌరా(12864), 24న హౌరా-సికింద్రాబాద్(12703), శాలిమార్-వాస్కో(18047), సికింద్రాబాద్-మాల్దా(03429), 25న భువనేశ్వర్-సికింద్రాబాద్(17015), భువనేశ్వర్-బెంగళూరు(18463), 26న సికింద్రాబాద్-సిల్చార్ రైళ్లను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

## క్రీడలకు అత్యంత ప్రాధాన్యం



తలపడుతున్న క్రీడాకారులు

**వేటపాలెం, న్యూస్‌టుడే:** జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆ విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్, ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్ కార్యదర్శి డాక్టర్ పి.రాజు అన్నారు. ఇప్పటి వరకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కింద 0.5 క్రెడిట్స్ ఇస్తుండగా దాన్ని ఈ ఏడాది నుంచి 1.5 క్రెడిట్స్‌కు పెంచుతున్నట్లు చెప్పారు. సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మంగళవారం వర్సిటీ స్థాయిలో జట్ల ఎంపిక నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ కె.జగదీష్ బాబు, చీరాల గ్రామీణ సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యానికి ఆటలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌రావు, పీడీ అన్నం శ్రీనివాసరావు, మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, వేటపాలెం ఎస్సై ఎం.వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ కోచ్ బి.దేవేశ్వరరావు, తైక్వాండో ఇన్‌స్ట్రక్టర్ తులసి, ప్రకాశం జిల్లా తైక్వాండో అసోసియేషన్‌కు చెందిన సయ్యదల్ సలావుద్దీన్, షేక్ ఆబ్దుల్ సలాం, వివిధ కళాశాల క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీల ప్రారంభానికి ముందు జ్యోతి వెలిగిస్తున్న ప్రతినిధులు

## ఏఎన్‌యూలో అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలు

**ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో మంగళవారం అంతర్ కళాశాలల పురుష బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపారాణి ఈ పోటీలను ప్రారంభించారు. మొత్తం 8 కళాశాలల జట్లు పాల్గొనగా నాలుగు జట్లు లీగ్ దశకు చేరుకున్నాయి.

## అభినవ గాంధీ ఎస్ఆర్ శంకరన్



శంకరన్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నిమ్మగడ్డ రమేష్‌కుమార్, చక్రపాణి, సుబ్రహ్మణ్యం, చక్రపాణి, ఆచార్య హరగోపాల్, జేసీ ప్రఖర్‌జైన్

**బాపట్ల, న్యూస్‌టుడే:** పేదల జీవితాల్లో వెలుగులు నింపి ఐఏఎస్ గాంధీగా ఎస్ఆర్ శంకరన్ నిలిచారని విశ్రాంత ఐఏఎస్ అధికారి, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కళాశాల పూర్వ డీజీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అన్నారు. ఎస్ఆర్ శంకరన్ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి శంకరన్ జయంతి కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎన్.రమేష్‌కుమార్, ఎస్.చక్రపాణి, ఆర్.సుబ్రహ్మణ్యం, డి.వరప్రసాద్, జేసీ ప్రఖర్ జైన్, ఆచార్య హరగోపాల్, ట్రస్టు అధ్యక్షుడు కారుమంచి విజయకుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మనోబంధు ట్రస్టు మానసిక దివ్యాంగులకు ఏర్పాటు చేసిన అంబులెన్స్‌ను జేసీ ప్రారంభించారు. మనోబంధు ట్రస్ట్ ఛైర్మన్ బి.రామకృష్ణారావు, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు, ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

### వేటపాలెం గ్రంథాలయం సందర్శన నా చిరకాల కోరిక

**వేటపాలెం:** సారస్వతనికేతన్ గ్రంథాలయాన్ని సందర్శించాలనేది నా చిరకాల కోరిక, అది ఈ రోజు నెరవేరిందని రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పేరొందిన బాపట్ల జిల్లా వేటపాలెం గ్రంథాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించి మాట్లాడారు. స్వాతంత్య్రోద్యమంలో ప్రధాన భూమిక పోషించిన మహాత్ముల ప్రత్యక్షంగా ఇక్కడ చూడటం ఒక గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ స్మారక చిహ్నంగా ఆయన వదిలివెళ్లిన చేతికర్రను ఇప్పటికీ ఇక్కడ ఎంతో పవిత్రంగా పరిరక్షించడం విశేషమన్నారు. ఎవరిమీద ఆధారపడకుండా దీన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు. తాళపత్ర గ్రంథాలు, లైబ్రరీలో ఉన్న పురాతన, శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం పుస్తకాలు, ఆంధ్రప్రభ తొలి ప్రతిని పరిశీలించారు. గ్రంథాలయ ఏర్పాటు, నిర్వహణ విషయాలను కార్యదర్శి పట్టాభి వెంకటేశ్వర్లు, రమేష్‌కుమార్‌కి వివరించారు. అనంతరముందు ఆయన్ని పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. వెంట బాపట్లకు చెందిన ఉమ్మారెడ్డి వెంకటరామారావు, చినగంజాం నివాసి కుర్రి రామసుబ్బారావు, పట్టభద్రుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రత్తి వెంకటసుబ్బారావు, సుంకర వెంకట లక్ష్మీప్రసాదు, గ్రంథపాలకురాలు శ్రీవల్లి, కాకరపర్తి చంద్రమోహన్, తెదేపా నాయకులు నాసిక వీరభద్రయ్య, జాగాబత్తుని పోతురాజు, కర్ర శ్రీనివాసరావు, ఒలుకుల కోటయ్య ఉన్నారు.



# బంగారం వ్యాపారిని దోచిన నిందితుల అరెస్టు

## రూ.39 లక్షల నగదు స్వాధీనం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

**బాపట్ల, న్యూస్‌టుడే:** జాతీయ రహదారిపై మేదరమెట్ల వద్ద బంగారం వ్యాపారి స్వరూప్‌కుమార్ నుంచి నగదు దోచిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.39 లక్షల నగదు, కారు, టార్చిలైట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం విలేకరులకు నిందితుల వివరాలు వెల్లడించారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కాటూరు గ్రామానికి చెందిన ధనికొండ వెంకన్న స్వామి గతంలో లారీ డ్రైవర్‌గా పని చేశాడు. అదే గ్రామానికి చెందిన అతని స్నేహితులు పగడాల మహేష్ కార్పెంటర్‌గా, టెంటు కార్తీక్, పూరేటి శివ శ్రీనివాసరావు వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నారు. వెంకన్న స్వామి తల్లి మూత్రపిండాలు పాడై మంచానపడ్డారు. ఆమెకు చికిత్స నిమిత్తం త్వరగా నగదు సంపాదించాలని భావించి స్నేహితులతో కలిసి చోరీ చేయాలని నిర్ణయించాడు. వెంకన్నస్వామి గతంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తూ విజయవాడ నుంచి చెన్నై వరకు లారీ నడిపాడు. ఆ సమయంలో గుంటూరు, చిలకలూరిపేట, వలపర్ల ప్రాంతానికి చెందిన బంగారు వ్యాపారులు చెన్నైలో బంగారం కొనుగోలుకు భారీ మొత్తం నగదుతో వెళ్లేవారు. అలా ఏదైనా లారీని ఆపి వ్యాపారులను బెదిరించి రూ.లక్షలల్లో చోరీకి ప్రణాళిక రూపొందించారు. ఈ నెల 18న రాత్రి విజయవాడలో ప్రైవేటు ట్రావెల్స్‌లో కారు అద్దెకు తీసుకుని నంబరు ప్లేటు తీసేసి విజయవాడ నుంచి ఓ లారీని అనుసరించారు. గుంటూరు సమీపంలో వ్యాపారి స్వరూప్ కుమార్ నోట్ల కట్టల సంచితో లారీ ఎక్కటం గమనించారు. ప్రణాళిక ప్రకారం మేదరమెట్ల వద్ద ఎన్‌హెచ్ 16లో కొరిశపాడు పై వంతెన వద్ద లారీకి కారు అడ్డు పెట్టి ఐటీ అధికారులమని చెప్పి లారీ డ్రైవర్, వ్యాపారిని బెదిరించారు. వ్యాపారిని కొట్టి కారులో ఎక్కించుకుని కొంత దూరం తీసుకెళ్లి అతని సంచిలో ఉన్న రూ.39.50 లక్షల నగదును తీసుకున్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి కారులో పరారయ్యారు. బాధితుడు మరుసటి రోజు మేదరమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ వెంటనే స్పందించి చీరాల డీఎస్పీ జగదీష్ నాయక్ నేతృత్వంలో అద్దంకి గ్రామీణ సీఐ మల్లికార్జునరావు, సీసీఎస్ సీఐ ప్రేమయ్య, మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్సై సురేష్, జే.పంగులూరు ఎస్సై వినోద్‌బాబు, పోలీసు సిబ్బందితో కలిసి నాలుగు ప్రత్యేక బృందాలను నియమించారు. బృందాలు ఎన్‌హెచ్-16 టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరాలు పరిశీలించి నలుగురు నిందితులను అరెస్టు చేశాయి. వారి నుంచి రూ.39 లక్షల నగదు, కారు, టార్చిలైటు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఏ1 నిందితుడైన వెంకన్నస్వామిపై గతంలో తెలంగాణ రాష్ట్రం సరూర్ నగర్ పీఎస్‌లో, ఏ3 నిందితుడు టెంటు కార్తీక్‌పై చిలకలూరిపేట పీఎస్‌లో కేసులు నమోదై ఉన్నాయి. దారి దోపిడీ కేసును 48 గంటల్లో ఛేదించి నగదు రికవరీ చేసిన సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించి నగదు పురస్కారాలు అందజేశారు.

## యువకుల వివాదం.. పోలీసుల కౌన్సెలింగ్

**చీరాల అర్బన్, న్యూస్‌టుడే:** వివాదానికి పాల్పడిన యువకులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈఘటన మంగళవారం ఒకటో పట్టణ పోలీసుల స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సోమవారం రాత్రి స్థానిక రైల్వేస్టేషను సమీపంలో ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని మరో వాహనంతో వచ్చిన యువకులు ఢీకొట్టారనే దానిపై వారు బాహాబాహీకి దిగారు. విషయం తెలియడంతో పోలీసులు అక్కడకు చేరుకుని అక్కడి నుంచి అందర్నీ పంపించి వేశారు. అనంతరం వీరిని స్థానిక పోలీసు స్టేషన్‌కి పిలిచి సీఐ మారీడు శ్రీనివాసరావు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనల్లో పాల్గొంటే రౌడీషీటు తెరుస్తామని హెచ్చరించారు. నలుగుర్ని బైండోవర్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

## 25,26 తేదీల్లో ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ పర్యటన

**ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ఎక్స్‌పర్ట్ కమిటీ ఈనెల 25, 26 తేదీల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పర్యటిస్తోందని రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తెలిపారు. కమిటీ పర్యటించే రెండు రోజులు బోధన, బోధనేతర సిబ్బంది అందుబాటులో ఉండాలని వెల్లడించారు.

## విద్యుదాఘాతంతో సన్నకారు రైతు మృతి



లింగయ్య(పాతచిత్రం)

**సూరేపల్లి(అద్దంకి), న్యూస్‌టుడే:** టీవీ ప్రసారాల కోసం ఇంటి డాబా పైకి ఎక్కిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ సంఘటన బల్లికురవ మండలం సూరేపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జీవీ.చౌదరి అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన లింగయ్య(77) సోమవారం సాయంత్రం వర్షం కురిసిన తరువాత టీవీలో ప్రసారాలు సక్రమంగా రావటం లేదని, కేబుల్ తీగలు సరిచేసేందుకు డాబాపైకి వెళ్లారు. అక్కడే ఉన్న విద్యుత్తు తీగలు తగలడంతో శరీరం, చేతికి విద్యుత్తు ప్రసారమై కిందపడ్డారు. తరువాత కుటుంబ సభ్యులు పరిశీలించగా అప్పటికే ఆయన మృతిచెందారు. ఆ మేరకు బల్లికురవ పోలీసులకు మంగళవారం ఉదయం సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య అంజమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్త అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### చికిత్స పొందుతూ వృద్ధుడు..

**వేమవరం(అద్దంకి):** మూత్రవిసర్జన సమయంలో జారిపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన సంఘటన బల్లికురవ మండలం వేమవరంలో చోటుచేసుకుంది. ఎస్సై జీవీ. చౌదరి అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన గరికపాటి గోవర్ధనయ్య(71) ఈనెల 17న ఇంటి వద్దనే మూత్రవిసర్జన సమయంలో జారిపడ్డారు. గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా మరణించారు. మృతుడి కుమారుడు మురళీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన సుధాకర్

**మేదరమెట్ల, న్యూస్‌టుడే:** ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్లలో జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న మరో గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో వెనుక లారీలో ఉన్న వి. సుధాకర్‌కు గాయలయ్యాయి. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న లారీని యంత్రాల సాయంతో పక్కకు తొలగించి, రవాణాకు ఆటంకం లేకుండా చేశారు.

## కారు ఢీకొని యువకుడి దుర్మరణం

**మార్టూరు, న్యూస్‌టుడే:** తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో ఓ పరిశ్రమలో పనిచేస్తున్న తండ్రి వద్ద నగదు తీసుకుని రోడ్డు దాటుతున్న యువకుడిని కారు ఢీకొన్న ప్రమాదంలో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన మార్టూరులో మంగళవారం జరిగింది. మండలంలోని జొన్నతాళి కూడలిలో చెన్నై - కోల్‌కతా రహదారిపై జరిగిన ప్రమాద వివరాలను సీఐ మద్దినేని శేషగిరిరావు తెలిపారు. వలపర్ల గ్రామానికి చెందిన అందె రాజశేఖర్ (35) ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి మార్టూరు సమీపంలోని జొన్నతాళి కూడలి వద్దకు స్నేహితులతో కలిసి వచ్చి, బండి నిలిపి జొన్నతాళి కూడలి వైపు హైవే రోడ్డు దాటాడని చెప్పారు. ఆవలి వైపునకు చేరుకుని అక్కడ పరిశ్రమలో తాత్కాలిక కార్మికుడిగా పనిచేస్తున్న తన తండ్రి ఆదినారాయణ వద్ద నగదు తీసుకుని మళ్లీ ద్విచక్ర వాహనం ఉంచిన పడమర వైపునకు వస్తున్నాడు. ఈక్రమంలో గుంటూరు వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో రాజశేఖర్ ఎగిరి రోడ్డుపై పడి, దుర్మరణం చెందినట్లు వెల్లడించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతదేహాన్ని మార్టూరు జీహెచ్‌కి తరలించారు. కాగా, రాజశేఖర్ అవివాహితుడని బంధువులు వెల్లడించారు.

### బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 133, రిటైల్ ధర - 155, చికెన్ విత్‌స్కిన్ - 225, చికెన్ స్కిన్‌లెస్ - 256.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

### నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

# బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

## సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేత

**రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే:** రేపల్లె నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నిధులు మంజూరు చేయించారు. రేపల్లెలో మంత్రి నివాసంలో తెదేపా నేత శివప్రసాద్ మంగళవారం నియోజకవర్గంలోని 27 మందికి రూ.41 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రం అందజేశారు. నాయకులు వడ్డి లక్ష్మీజ, మహేష్, సాయిబాబు, ధర్మతేజ తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యుడికి పత్రం అందిస్తున్న తెదేపా నేత అనగాని శివప్రసాద్

## ఉల్లిపాలెం విద్యార్థుల ప్రతిభ

**నగరం, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్రం బాపట్లలో ఇటీవల నిర్వహించిన 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ఉల్లిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల బాలికలు ప్రథమ, తృతీయ బహుమతులు సాధించారు. స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుచున్న కె.లక్ష్మీ సిందూర వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.5,000 నగదుతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఇదే పాఠశాలకు చెందిన జి.కవిత వక్తృత్వ పోటీలో తృతీయ స్థానంలో నిలిచి ప్రశంసాపత్రం, రూ.2,000ల నగదు జేసీ ప్రఖర్ జైన్ చేతుల మీదుగా అందుకున్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల: 80085 73141, రేపల్లె: 80085 73135, వేమూరు: 91107 837382

### కాల్వలో పూడికతీత

**పిట్టలవానిపాలెం:** మండలంలో పిట్టలవానిపాలెం పడమర వీధిలో సీసీ రహదారి గుంతలతో నిండి మట్టి, ఇసుక పేరుకుపోయాయి. వర్షపు నీరు గుంతలో నిల్వ ఉండటంతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు' ఈనెల 19న అధికారుల దృష్టికి తెచ్చింది. స్పందించిన కార్యదర్శి వసుంధరలక్ష్మి సిబ్బందిని పంపి కాల్వలు తీయించి రహదారిపై నీరు నిల్వ ఉండకుండా చేశారు. సమస్య పరిష్కారం కావటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**భట్టిప్రోలు, న్యూస్‌టుడే:** భట్టిప్రోలు కూరగాయల మార్కెట్ వెనుక జండా చెట్టు వద్ద 'మేమున్నాం.. మీకు తోడుగా'.. రహదారిపైకి మురుగు పారుదల అవుతుందని ఆ ప్రాంతవాసులు ఆదివారం సమస్యను అధికారుల దృష్టికి తెచ్చారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆ ప్రాంతంలోని మురుగు పూడిక తీయించారు.

స్పందనకు వందనం

# మాడిన దీపాలు.. వీధుల్లో చీకట్లు!

బాపట్ల, న్యూస్‌టుడే

పట్టణంలో రాత్రయితే చాలు చీకట్లు అలుముకుంటున్నాయి. చాలా వార్డుల్లో వందల సంఖ్యలో వీధి దీపాలు వెలగటం లేదు. గత వైకాపా పాలనలో పురపాలక సంఘం ఆర్థికంగా చితికిపోయింది. వీధి దీపాలు మాడినా, చెడిపోయినా మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. బిల్లులు రావటం లేదని గుత్తేదారు కొత్త బల్బులు, సామగ్రి, పరికరాలను సరఫరా చేయటం నిలిపివేశారు. తెదేపా నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని ప్రాంతాల్లో కొత్త దీపాలు అమర్చినా సమస్య ఇంకా పరిష్కారం కాలేదు.

### మిగ్‌జాం తుపాను ప్రభావంతో..

గతేడాది డిసెంబరు 4, 5 తేదీల్లో మిగ్‌జాం తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు, గాలులకు పట్టణంలో వీధి దీపాలు దెబ్బతిన్నాయి. కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. ఆర్థిక ఇబ్బందులతో అధికారులు కొత్త వాటిని కొనుగోలు చేయలేదు. అప్పటి నుంచి వీధి దీపాల సమస్య కొనసాగుతూనే ఉంది. సూర్యలంక రోడ్డులో సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించి పలు దీపాలు వెలగటం లేదు. పట్టణంలో దర్జిపెదమస్తాన్‌నగర్, కొత్త బజారు, నరాలశెట్టివారిపాలెం, విజయలక్ష్మీపురం, ప్యాడిసన్‌పేట, రైలుపేట, రామకృష్ణాపురం, ఆనందనగర్, కారుమూరి హనుమంతరావునగర్ కాలనీలో నెలల తరబడి వీధి దీపాలు వెలగక రాత్రిళ్లు చీకటిగా ఉండి రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. చీకట్లో రోడ్లపై గుంతలు కనపడక ప్రమాదాల బారినపడుతున్నారు.


నాలుగో వార్డులో వెలగని వీధి దీపాలు

| | |
|---|---|
| పురపాలక సంఘంలో వార్డులు | 34 |
| పురపాలక సంఘంలో వీధి దీపాలు | 6200 |
| వెలగని వీధి దీపాలు | 1200 |
| వంద రోజుల్లో కొత్తగా ఏర్పాటు చేసిన దీపాలు | 300 |

### మూడు నెలల్లో 300 అమర్చారు

తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామగ్రి, కొత్త దీపాలు కొనుగోలు చేసి 300 వరకు అమర్చారు. పాతవి చెడిపోతుండటం, బల్బులు మాడిపోతుండటం తదితర సమస్యల వల్ల వెలగని వీధి దీపాల సంఖ్య పెరుగుతోంది. నరాలశెట్టివారిపాలెం రాములవారి వీధిలో వారం రోజులుగా దీపాలు వెలగక రాత్రిళ్లు స్థానికులు చీకట్లోనే మగ్గుతున్నారు. వెయ్యి దీపాల వరకు కొత్తవి కొనుగోలు చేసి వార్డుల్లో అమర్చితేనే సమస్య పరిష్కారమవుతుంది.

### కొత్తవి కొనుగోలు చేస్తాం

కొత్త దీపాలు లేకపోవటంతో మాడిపోయిన వాటి స్థానంలో త్వరగా అమర్చలేకపోతున్నాం. పరికరాలు దెబ్బతింటే మరమ్మతులు చేయించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటున్నాం. కొత్త దీపాలు తెప్పించి వార్డుల్లో అమర్చి సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తాం. - **రఘునాథరెడ్డి, పురపాలక కమిషనర్**

## వేగంగా నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం

**బాపట్ల, న్యూస్‌టుడే:** పట్టణంలో నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణ శివారున డంపింగ్ యార్డ్‌ను ఆయన మంగళవారం పరిశీలించారు. తూర్పు, పడమర స్వాప్ మురుగుకాలువల్లో నీటిని శుద్ధి చేయటానికి నీటి శుద్ధి కేంద్రాన్ని డంపింగ్‌యార్డు పక్కనే ఉన్న భూమిలో నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు. మరుప్రోలువారిపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలోని మరో నీటి శుద్ధి కేంద్రం నిర్మాణానికి భూసేకరణ పూర్తి చేయాలని పేర్కొన్నారు. పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### ముంపు కాలనీల్లో నీటిని తొలగిస్తాం

పట్టణంలోని ముంపు ప్రభావిత ముస్లింవారి పాలెంలో నివాస గృహాల మధ్య నిలిచిన నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించి సమస్య పరిష్కరిస్తామని పురపాలక కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. ముస్లింవారిపాలెంలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఆయన మంగళవారం పర్యటించి నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు.

### ఘనంగా జేసీ జన్మదిన వేడుక


కేకు కోస్తున్న జేసీ ప్రఖర్‌జైన్

**బాపట్ల, న్యూస్‌టుడే:** జేసీ ప్రఖర్‌జైన్ జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. రైతు బజారు ప్రారంభోత్సవం సందర్భంగా జేసీ జన్మదిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కేకు తెప్పించారు. అధికారుల సమక్షంలో ప్రఖర్‌జైన్ కేకు కోశారు.

## విద్యుత్తు స్తంభానికి అల్లుకున్న తీగల తొలగింపు

**ఆరేపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే:** పచ్చి తీగలతో అల్లుకున్న విద్యుత్తు స్తంభాన్ని అధికారులు ఎట్టకేలకు శుభ్రం చేశారు. మండలంలోని ఆరేపల్లి నుంచి ఉచావారిపాలెం ఆర్‌అండ్‌బీ మార్గంలో పలు చోట్ల ఇలా తీగలు విద్యుత్తు స్తంభాలను అల్లుకుని రాత్రిళ్లు వీధి దీపాల వెలుతురు కనిపించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఈనెల 21న 'గుబురు తీగలతో గుండెల్లో గుబులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి రెండురోజులుగా తీగలు అల్లుకున్న స్తంభాలకు అల్లుకున్న తీగలు, వాటి చుట్టు పెరిగిన ముళ్లచెట్లను తొలగించి శుభ్రం చేసే పనులను నిర్వహిస్తున్నామని ఏఈ పి.శ్రీనివాసరావు తెలిపారు.


విద్యుత్తు స్తంభానికి తీగలను తొలగిస్తున్న సిబ్బంది

ఈనాడు కథనాలకు స్పందన

### పనులు మొదలు

**చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే:** మండల కేంద్రం చెరుకుపల్లిలోని సంపత్‌బాబు కాలనీలోని అపార్టుమెంట్ ముందు నిలిచిన మురుగునీటిని తొలగించే పనులను పంచాయతీ అధికారులు చేపట్టారు. అపార్టుమెంట్ ముందు నిలిచిన మురుగునీటిపై ఈనెల 19న 'పచ్చిక కాదిది.. పసర్లెత్తిన నీరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రెండు రోజులుగా మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి ఈవూరి బా తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సభలు

**నగరం, రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే:** రీ-సర్వే సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరిగిందని రేపల్లె ఆర్డీవో ఎస్.రామలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని పెద్దవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ-సర్వేలో లోపాలను, ఇతర సమస్యలను రైతులు గ్రామ సభల్లో అర్జీలు చేసుకోవచ్చన్నారు. నిర్వహించిన గ్రామ సభలో రైతుల నుంచి 6 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ నాంచారయ్య పేర్కొన్నారు. రేపల్లె మండలం కారుమూరులో గతంలో జరిగిన రీ- సర్వేపై మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో 20 అర్జీలు వచ్చాయని తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. డీటీ నిరంజన్, ఆర్ఐ రాంబాబు, సర్వేయరు బ్రహ్మయ్య, వీఆర్వో సురేష్‌బాబు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


గ్రామ సభలో పాల్గొన్న రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి

### నేడు బొద్దులూరుపాడులో..

**కొల్లూరు, న్యూస్‌టుడే:** మండలంలోని బొద్దులూరుపాడులో నిర్వహించి, పూర్తి చేసిన రీ-సర్వేపై రైతుల అభ్యంతరాలు స్వీకరించి, పరిష్కరించేదుకు బుధవారం గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు.

## చేతి వృత్తిదారులకు రుణాలు మంజూరు చేయాలి

**రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే:** చేతివృత్తిదారులకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టిముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం చేతి వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్డీవో రామలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. సూపర్ సిక్స్ వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాలుగు నెలలైనా చేతి వృత్తిదారులను ప్రోత్సహించేలా సహాయక చర్యలు చేపట్టక పోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులు కేటాయించకుండా మోసం చేసిందని మండిపడ్డారు.

## అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయండి

**బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే:** గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో బి.బాబూరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ పులి శరత్ బాబు అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

## పాఠశాలల్లో సమస్యలు గుర్తించండి

**నిజాంపట్నం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలుంటే గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ తీసుకుందామని ఎంఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం విద్యావనరుల కేంద్రంలో సీఆర్పీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ అపార్, విద్యాంజలి, వీధిబడి ఓఎస్సీ, ఆర్‌టీఈ తదితర కార్యక్రమాలపై చర్చించారు.

## వ్యాసరచన పోటీల్లో విజేతలు వీరే


**బాపట్ల, న్యూస్‌టుడే:** పట్టణంలోని జెమ్స్ ఉన్నత పాఠశాల, లిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. పోటీల్లో 'ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జెమ్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు సీహెచ్ హారిక(పదో తరగతి) ప్రథమ, జె.నేహా సాయి పావని(పదో తరగతి) ద్వితీయ, ఆర్.వేద చంద్రిక(పదో తరగతి) తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ ఆదెళ్ల విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఎస్.శివవరప్రసాద్, ఎం.రవికుమార్ బహుమతులు ప్రదానం చేశారు. లిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఎస్‌కే ఉస్మాంగని ప్రథమ, ఎస్‌కే ఫరీదా ఖుర్దాన్ ద్వితీయ, ఎస్‌కే అస్మా తబస్సుమ్ తృతీయ స్థానం సాధించారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ మిరియాల సుబ్బారావు, ఉపాధ్యాయులు ఆర్.సురేష్‌బాబు, ఎస్‌కే బాషా, వి.ఉషారాణి బహుమతులు అందజేశారు.


జెమ్స్ ఉన్నత పాఠశాలలో..


లిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాలలో..

## శిథిలావస్థలో తుపాను భవనం

**పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే:** మండలంలోని కోమలిలో శిథిలావస్థకు చేరిన తుపాను రక్షణ భవనంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. నివాస ప్రాంతాలు, పాఠశాల దగ్గర ఉండటంతో అకస్మాత్తుగా కూలితే భారీ నష్టం తప్పదని భయం గుప్పిట గడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శిథిల భవనాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రఘు మాట్లాడుతూ భవనం తొలగింపు విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు.



## భయపెడుతున్న విద్యుత్తు నియంత్రికలు

భట్టిప్రోలు హేమ విఠలేశ్వరస్వామి దేవస్థానం ఎదుట రహదారి పక్కనే రెండు విద్యుత్తు నియంత్రికలు ఎలాంటి రక్షణ కంచె లేకుండా ప్రమాద భరితంగా ఉన్నాయి. పశువులు తిరిగేటప్పుడు అనుకోని ప్రమాదాలు జరుగుతాయేమోనని స్థానికులు భయపడుతున్నారు. వెంటనే రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఇన్‌ఛార్జి ఏఈ శాంతాకుమారిని సంప్రదించగా సిబ్బందితో పరిశీలన చేయించి త్వరలో రక్షణ కంచె ఏర్పాటు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, భట్టిప్రోలు**



## వానొస్తే తడవాల్సిందే

**బాపట్ల, న్యూస్‌టుడే :** బాపట్ల పాత బస్టాండ్ కూడలి నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. వర్షం కురిస్తే ప్రయాణికులు తడవకుండా నిలబడేందుకు సరైన సౌకర్యం లేదు. గతంలో పాతబస్టాండ్ వద్ద వంద మంది ప్రయాణికులు కూర్చునే వీలుండేది. రహదారి విస్తరణ పేరుతో దాతలు నిర్మించిన బస్సు షెల్టర్‌ను గత వైకాపా పాలనలో అధికారులు తొలగించారు. ఆ తర్వాత చిన్న షెల్టర్ మాత్రమే ఏర్పాటు చేయటంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అగచాట్లు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రయాణికులు తడుస్తూనే బస్సుల కోసం వేచిఉన్నారు.



## నేటి నుంచి ఎలుకల నివారణ మందు పంపిణీ

**వేమూరు,బాపట్ల పట్టణం, నగరం, పిట్టలవానిపాలెం,న్యూస్‌టుడే:** వేమూరు మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ఎలుకల నివారణ మందును బుధవారం నుంచి పంపిణీ చేయడం జరుగుతుందని బాపట్ల రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ అక్తర్ హుస్సేన్ తెలిపారు. వరిసాగు చేస్తున్న అన్నదాతలు స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాల వద్దకు నూనె, నూకలు తీసుకువెళ్లాలని సూచించారు. ముందుగా పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని వేమూరు, జంపని వరిపొలాలను పరిశీలించారు. బాపట్ల మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన సదస్సులు జరుగుతాయని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏవో రమేష్ పేర్కొన్నారు. రేపల్లెలోని వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రెండు గ్రాముల బ్రోమోడయోలిన్, 20 గ్రాముల నూనె, 960 గ్రాముల నూకల మిశ్రమాన్ని పంట చేలల్లో ఎలుకలు ఏర్పాటు చేసుకున్న బొరియల్లో పది గ్రాముల మిశ్రమాన్ని ఉంచాలని ఆయన పేర్కొన్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద బుధవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏవో సత్యానంద్ తెలిపారు.

## విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక అలవర్చుకోవాలి

**రేపల్లె అర్బన్ నగరం, వేమూరు,న్యూస్‌టుడే:** విద్యార్థి దశ నుంచి మంచి నడవడిక అలవర్చుకోవాలని, ఇతరులను బాధపెట్టకూడదని సోదర భావంతో మెలగాలని రేపల్లె టౌన్ సీఐ మల్లికార్జునరావు సూచించారు. మాంట్‌ఫోర్ట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీసు అమర వీరుల స్మారక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విధి నిర్వహణలో అమరులైన పూడివాడ గ్రామానికి చెందిన కట్టుపల్లి వెంకటేశ్వర్లు, కాసాని శివాంజనేయుల కుటుంబాలను రేపల్లె రూరల్ సీఐ సురేశ్‌బాబు పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అమరవీరుల సమస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పెరవలి, వేమూరు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పోలీసుల త్యాగాలు, సేవలు, చట్టాలపై వేమూరు సీఐ వీరాంజనేయులు, ఎస్సై రవికృష్ణ అవగాహన కల్పించారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రేపల్లెటౌన్ సీఐ మల్లికార్జునరావు

## కార్యకర్తలు సమన్వయంతో మెలగాలి

**వేమూరు, న్యూస్‌టుడే:** జనసేన కార్యకర్తలు సమన్వయంతో మెలగాలని ఆ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తెలిపారు. జనసేన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం వేమూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత మన కార్యకర్తల కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని వాటిని ఎమ్మెల్యే ఆనందబాబుతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా చూస్తానని నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్ తెలిపారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

**బాపట్ల పట్టణం,రేపల్లె అర్బన్, కొల్లూరు, యలవర్రు, గోవాడ, (అమృతలూరు), న్యూస్‌టుడే:** పంట యాజమాన్య పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకురాలు లక్ష్మి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వెదుళ్లపల్లి, బేతపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. సేంద్రియ ఎరువులు వినియోగం పెంచి అధిక పంట దిగుబడి సాధించేలా రైతులు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ రేపల్లె సహాయ సంచాలకుడు రాగల విజయబాబు సూచించారు. మండలం గంగడిపాలెం, రాజుకాల్వ గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటకు తెగుళ్లు, పురుగులతోనే కాకుండా ఎలుకల వల్ల కూడా తీవ్ర నష్టం వాటిల్లుతోందని, వాటిని నివారించకపోతే పంట దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని కొల్లూరు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చిలుమూరు, అనంతవరంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరిపైరులో అక్కడక్కడ దోమ, ఆకుముడత తెగుళ్ల బెడద ఉందని మండల వ్యవసాయ అధికారిణి లోకేశ్వరి పేర్కొన్నారు. అమృతలూరు మండలంలోని యలవర్రు, గోవాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట యాజమాన్య పద్ధతులతో రైతులు పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకురాలు లక్ష్మి తెలిపారు. బాపట్ల మండల పరిధిలోని వెదుళ్లపల్లి, బేతపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.


బాపట్ల: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ లక్ష్మి, ఏవో చంద్రశేఖర్

## తెదేపా నేత మృతి తీరనిలోటు

**బాపట్ల, న్యూస్‌టుడే:** తెలుగు రైతు ఉపాధ్యక్షుడు ఇనగంటి శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండల పరిధిలోని అప్పికట్లలో ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన తెలుగు రైతు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఇనగంటి శ్రీనివాసరావు సంస్మరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నేతలతో కలిసి వేగేశన పువ్వులు వేసి నివాళి అర్పించారు.

## జూద శిబిరంపై దాడి

**రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే:** రేపల్లె మండలం సింగుపాలెంలో మంగళవారం జూద శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకున్నామని సీఐ మల్లికార్జునరావు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఆయన తెలిపారు.

## రేపల్లెను పరిశుభ్రంగా ఉంచుదాం

**రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే:** రేపల్లె పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా అందరూ సహకరించాలని కమిషనర్ కాకర్ల సాంబశివరావు కోరారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం పట్టణంలో కొబ్బరిబోండాల విక్రయదారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణ శివారు ప్రాంతాలు పెనుమూడి, పేటేరు, గుడ్డికాయలంక, అరవపల్లి వెళ్లే మార్గాల్లో కొబ్బరి చిప్పలు, బోండాలను గుట్టలుగా పడేస్తున్నారన్నారు. తద్వారా రాకపోకలు సాగించే వాహనచోదకులు, బాటసారులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ చర్యలు నివారించాలని ఆయన వ్యాపారులను కోరారు.

# గత పాలకుల నిర్లక్ష్యం.. అభివృద్ధి శూన్యం

### చందోలులో మౌలిక వసతులు కరవు


నిర్మాణానికి నోచుకోని రహదారి

**చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే**

పదివేల జనాభా ఉన్న పిట్టలవానిపాలెం మండలం పరిధిలోని మేజరు పంచాయతీ చందోలులో మౌలిక వసతులు కరవయ్యాయి. గత వైకాపా నిర్లక్ష్యంతో సరైన కాలువల నిర్మాణం లేక మురుగు రహదారులపై పారుతోంది. ప్రధాన వీధుల్లో సైతం సీసీ రహదారులు కరవయ్యాయి. చిన్నపాటి వర్షం వచ్చినా రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్ల రహదారుల పక్కన ఖాళీ స్థలాల్లో పనికిరాని మొక్కలతో పాటు మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. విషపురుగులు సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

### అయిదేళ్లయినా పూర్తికాని రహదారి

గ్రామంలోని బ్రాహ్మణ వీధిలో 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.12 లక్షలతో సీసీ రహదారి నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. రహదారికి ఇరువైపుల సైడువాల్స్ పోసిన అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణం నిలిచిపోయింది. అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం రహదారి నిర్మాణం చేపట్టలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అయినా రహదారి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రహదారులు జలమయం

గ్రామంలో మురుగు కాల్వ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో కొద్దిపాటి వర్షానికే రహదారులపై నీరు నిలిచి మూడునాలుగు రోజులుగా తిష్ట వేస్తున్నాయి. సచివాలయానికి వెళ్లే రహదారి, 1 వార్డులో ప్రధాన సీసీ రహదారి, జడ్పీ పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారిపై రెండు అడుగుల మేర నీళ్లు నిలుస్తున్నాయి, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టి రహదారులపై మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ రఘును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పల్లె పండుగ కార్యక్రమంలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఆయన తెలిపారు.


సచివాలయానికి వెళ్లే మార్గం ఇలా..

# చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? ఇంకొల్లు పాతచెన్నై రహదారి పాత ఆంధ్రా బ్యాంకు వీధిలో గతంలో ఏర్పాటు చేసిన చెత్త కుండీ తొలగించారు. చెత్త సేకరణ కార్మికులు రాని సమయాల్లో వ్యర్థాలు వేసేందుకు చెత్త కుండీ ఏర్పాటు చేయాలి

**అజయ్‌కుమార్, 9వ వార్డు.**

✔ గతంలో ఏర్పాటు చేసిన చెత్తకుండీలు పగుళ్లిచ్చి పాడైపోవటంతో తొలగించాం. త్వరలో అవసరమైన ప్రదేశాల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేస్తాం. **-రామ సుబ్బారెడ్డి కార్యదర్శి, ఇంకొల్లు**

**ఇంకొల్లు, న్యూస్‌టుడే:**

? కడవకుదురు పంచాయతీ పరిధిలోని పాతపాడు వద్ద నాలుగు వీధి దీపాలు వారం రోజులుగా వెలగడం లేదు. రాత్రులు పాములు తిరుగుతున్నాయి. వీధి దీపాలు వేయించి సమస్యను పరిష్కరించండి.

**- శ్రీనివాస్, సుబ్బారావు, విద్యార్థులు, కడవకుదురు**

✔ పరిశీలించి, రెండు మూడు రోజుల్లో వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తా. **- పి.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి, కడవకుదురు**

**కడవకుదురు (చినగంజాం), న్యూస్‌టుడే**

? జే పంగులూరు సచివాలయం వెనుక విషసర్పాలు సంచరిస్తున్నాయి. వారంరోజుల్లో 15సార్లు విషసర్పం తిరిగింది. తక్షణం పరిసరాల్లో పెరిగిన చెట్లను తొలగించాలి.

**- శివపార్వతి, జే పంగులూరు**

✔ వెంటనే సచివాలయ సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయిస్తాం

**- బి.రాంబాబు, కార్యదర్శి, జే పంగులూరు** **జే పంగులూరు, న్యూస్‌టుడే :**

? అద్దంకి పురపాలక సంఘం పరిధిలోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదురుగా గల మంచినీటి వాల్వుపై మూత ఏర్పాటు చేయలేదు. వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. **- నాగేశ్వరరావు, అద్దంకి**

✔ వెంటనే పైమూత ఏర్పాటు చేయిస్తాం. **- బలరామరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, అద్దంకి పురపాలక సంఘం**

**అద్దంకి, న్యూస్‌టుడే**

### స్పందనకు వందనం

### వెలిగిన దీపాలు

**సంతరావూరు (చినగంజాం):** సంతరావూరు చెరువు ఎదురుగా ఉన్న దళితవాడలో రోడ్డు వెంట వీధి దీపం వెలగడం లేదు. రాత్రులు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించండని స్థానికులు సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా ఆదివారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన గ్రామ కార్యదర్శి కె.కృపారావు పంచాయతీ కార్మిక సిబ్బందిని పంపించి, మంగళవారం వీధి దీపాలకు మరమ్మతులు చేయించి, సమస్యను పరిష్కరించారు.

### వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు

**చీరాల గ్రామీణం:** చీరాల మండలం దేవాంగపురి వాటర్ ప్లాంట్ ఫిల్టర్లలో సామగ్రిని మార్చి మరమ్మతులు చేపట్టినట్లు కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడ రక్షిత నీటిలో పురుగులు వచ్చాయని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 'ఈనాడు' - 'మీతోడుగా'లో సోమవారం వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ప్లాంటును పరిశీలించారు. ఫిల్టర్లను బాగుచేసి అందులో రూ.5 వేలతో కొత్త సామగ్రిని అమర్చినట్లు కార్యదర్శి తెలిపారు.

## విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

**ఇడుపులపాడు (ఇంకొల్లు), న్యూస్‌టుడే:** గుంటూరు మానవత స్వచ్ఛంద సంస్థ ఇడుపులపాడుకు చెందిన పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేసింది. గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి పి.అజయ్‌కు సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు రూ.60 వేల విలువచేసే ల్యాప్‌టాప్‌ను మంగళవారం విద్యాపరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. సంస్థ ప్రతినిధులు సూది సుబ్బారావు, గురవారెడ్డి, రమేష్, శివాజీ, సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, సుబ్రహ్మణ్యం, సాయిరాం పాల్గొన్నారు.



# విద్యాలయం.. సౌరమయం

### సోలార్ విద్యుత్తుతో రావినూతల పాఠశాలకు తగ్గిన బిల్లు

**రావినూతల (మేదరమెట్ల), న్యూస్‌టుడే**

కొరిశపాడు మండలం రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది సౌరశక్తితో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.4 లక్షల వ్యయంతో 5.4 కిలోవాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంటును 2023 జనవరిలో ఏర్పాటు చేశారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. రావినూతల పల్లెటూరు కావడంతో విద్యుత్తు సక్రమంగా ఉండదు. దీంతో బడిలో డిజిటల్ బోధనకు కొంత అంతరాయం ఏర్పడేది. కానీ సౌర విద్యుత్తు ఏర్పాటుతో ఆ సమస్య తీరింది. విద్యుత్తు బిల్లు గతంలో నెలకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వచ్చేది. ప్రస్తుతం రూ.30 నుంచి రూ.150 వరకు వస్తుంది. ఇక్కడ 6 నుంచి పదో తరగతి వరకు ఉండగా ప్రస్తుతం 200 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. మొత్తం 15 గదులు ఉన్నాయి.

విద్యాలయంలో సౌరశక్తిని ఉపయోగించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే పర్యావరణ స్పృహతో కూడిన అభ్యాసాలను విద్యార్థుల్లో ప్రోత్సహించినట్లు అవుతుంది. పెరుగుతున్న బిల్లుల భారం తగ్గించడమే కాకుండా మిగులు విద్యుత్తును విక్రయించే అవకాశం ఉంది. సోలార్ ప్యానళ్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తును బడి అవసరాలకు వినియోగించగా మిగిలినది పవర్‌గ్రిడ్‌కు బదిలీ చేస్తారు. ఆ సంస్థకు విక్రయించిన విద్యుత్తుకు యూనిట్ల వారీగా లెక్కించి, పాఠశాలకు తిరిగి డబ్బు చెల్లిస్తుంది.



పాఠశాల భవనంపై ఏర్పాటు చేసిన సౌర పలకలు



విద్యుత్తు ప్యానల్ బోర్డు

### విద్యుత్తు భారం తగ్గింది



సోలార్ విద్యుత్తు యూనిట్ ఏర్పాటుతో పాఠశాలకు విద్యుత్తు బిల్లుల భారం తగ్గింది. గతంలో బడి నిర్వహణ ఖర్చుల్లో అధికభాగం విద్యుత్తు బిల్లులకే కేటాయించాల్సి వచ్చేది. 'సౌర'తో బిల్లులు చెల్లించే బాధలు తప్పడమే కాకుండా పాఠశాలకే కొంత ఆదాయం వస్తుంది. ఆ నగదును బడి నిర్వహణకు వినియోగిస్తున్నాం. **- కానుగుల చెన్నయ్య, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు**

## వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సురేష్

**ఇంకొల్లు, న్యూస్‌టుడే:** వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇంకొల్లు ఎస్సై సురేష్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు 'వ్యసనాలు- వాటి ప్రభావం' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశలో అలవాట్లు జీవిత కాలం వెంట ఉంటాయన్నారు. మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తుల వినియోగం ప్రాణాంతకమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నామ్ రహదారిపై వాహనాల క్రమబద్ధీకరణ



బస్టాండ్ వద్ద వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

ఈనాడు కథనానికి స్పందన

**అద్దంకి, న్యూస్‌టుడే:** నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై వాహనాల యజమానులు ఇష్టారీతిన నిలుపుతున్నారు. దీనికితోడు పలు దుకాణాలకు వచ్చిన సరకులు దించేందుకు వేళలు పాటించడం లేదు. ఈవిషయమై గత నెల 11న 'అసలే ఇరుకు రహదారి.. ఆపై వాహనాలు నిలిపివేత' శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి పోలీసులు స్పందించారు. మంగళవారం నుంచి ఒక ఏఎస్ఐ, కానిస్టేబుల్‌ను కేటాయించారు. పట్టణ పరిధిలో వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. బంగ్లా రోడ్డు నుంచి భవానీ కూడలి వరకు నిబంధనలకు విరుద్ధంగా నిలిపిన వాహనచోదకులను తొలిసారిగా హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ తీరు మార్చుకోనట్లయితే కేసు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు.

## పోలీస్‌స్టేషన్ తనిఖీ

**అద్దంకి, న్యూస్‌టుడే:** అద్దంకి పోలీస్‌స్టేషన్‌ను చీరాల డీఎస్పీ జగదీష్‌నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. అద్దంకి ప్రాంతంలో దొంగతనాలు పెరిగిపోతున్నాయని, వాటిని నిరోధించాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని వెల్లడించారు.

## నిరుపేదల బతుకుల్లో వెలుగులు నింపిన శంకరన్



విజయనగర్‌కాలనీలో శంకరన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

**చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే:** ఏడాదిలోనే 120 జీవోలు జారీ అయ్యేలా చేసి నిరుపేదల బతుకల్లో వెలుగులు నింపిన ఘనత దివంగత ఐఏఎస్ అధికారి శంకరన్‌కే దక్కుతుందని పలువురు కొనియాడారు. చీరాల మండలం విజయనగర్ కాలనీలో మంగళవారం ఆయన జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ వైస్ ఎంపీపీ దుడ్డు భాస్కరరావు, ప్రజా సంఘాల నేతలు బి.లక్ష్మీనరసయ్య, గొర్రెపాటి రవికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, కారంచేడు బాధితులకు మధ్యవర్తిగా వ్యవహరించి పూర్తి పునరావాసం అందేలా కృషి చేశారన్నారు. గ్రామ పెద్దలు సుందరరావు, లక్ష్మీ ప్రసాద్, దేవదానం, ఏసుపాదం, సుబ్బారావు, దుడ్డు వెంకటేశ్వర్లు, గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలువలో వ్యర్థాలు వేయకుండా చూడరూ..



మురుగు కాలువ అంచున వ్యర్థాలు (పాత చిత్రం)

**ఇంకొల్లు, న్యూస్‌టుడే:** కాలువల్లో మురుగు వ్యర్థాలను తొలగించాల్సిన పంచాయతీ అధికారులు రోడ్డు పక్కన వ్యర్థాలతో కాలువలు పూడ్చి రైతులకు నష్టం కలిగిస్తున్నారు. స్థానిక కడవకుదురు రహదారి పక్కన ఆటోనగర్ నుంచి ఒకటోమైలు వరకు పంచాయతీ సేకరించిన వ్యర్థాలు రహదారి పక్కన అంచుల్లో పోస్తున్నారు. వ్యర్థాలు ఎక్కువ కావటంతో ఇటీవల జేసీబీతో వాటిని కాలువల్లోకి నెట్టేశారు. దీంతో భారీవర్షాలకు వరద నీటితో కాలువ పొంగి, పక్కనే ఉన్న పొలాలకు గండ్లు పడ్డాయి. గ్రామంలోని సగం మురుగు ఈ కాలువ ద్వారానే ప్రవహిస్తుంది. కాలువ విశాలంచేసి మురుగు, వరదనీరు దిగువకు వెళ్లేలా చూడాల్సిన పంచాయతీ స్వయంగా వ్యర్థాలను కాలువల్లోకి నెట్టడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే రహదారిలో ఒకటో మైలు వంతెన పక్కన వాగులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసుకోవాలని అప్పటి ప్రకాశం జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కొంతకాలం వ్యర్థాలు అక్కడికే తరలించారు. ప్రస్తుతం గ్రామానికి ఆనుకుని ఉన్న అన్ని ప్రధాన రహదారుల్లో వ్యర్థాలు వేస్తున్నారు. కాలువ మరమ్మతుల పేరిట ఇప్పటికే పెద్దఎత్తున నిధులు వినియోగించారు. తమ పొలాలు గండ్లు పడకుండా ఉండాలంటే కాలువలోకి వ్యర్థాలు కలువకుండా చూడాలని రైతు బండ్ల వీరయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## చికిత్సకు రూ.1,08,600 మంజూరు



నగదు పత్రాలను రోగికి అందజేస్తున్న తెదేపా నేతలు

**మార్టూరు, న్యూస్‌టుడే:** ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో రోగికి మెరుగైన వైద్య సేవల కోసం రూ.1,08,600 నగదును ప్రభుత్వం ఎల్‌వోసీ ద్వారా మంజూరు చేసినట్లు మంగళవారం ఏలూరి క్యాంప్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మార్టూరుకు చెందిన తమ్ములూరి సామ్యూల్, వలపర్లకు చెందిన మల్లా కోటమ్మలకు ఈ నగదును వైద్య సేవల కోసం ఎమ్మెల్యే ఏలూరి మంజూరు చేయించినట్లు వెల్లడించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో బాధిత రోగులకు మంజూరు పత్రాలను తెదేపా నేతలు తాటి నాగేశ్వరరావు, ముద్ర హనుమంతరావు, గొట్టిపాటి వెంకట్రావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, చెరుకూరి అంజిబాబు అందజేశారు.



## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**వేటపాలెం, న్యూస్‌టుడే:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా బాలల సంరక్షణ సమితి అధికారి జి.కృష్ణ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఊటుకూరి సుబ్బయ్యపాలెంలో ప్రిపేర్ సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులు, అభివృద్ధి, బాల్య వివాహాలు, చట్టాల గురించి గడిచిన నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు మంగళవారం ముగింపు సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. చివరి రోజు స్వయం ఉపాధిపై నాబార్డు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రిపేర్ సమన్వయకర్త ఎం.రవిచంద్ర, రమణారెడ్డి, వెంకటేశ్వర్లు, సంస్థ సిబ్బంది, గ్రామకాపులు ఉన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు రహదారి ఏర్పాటు



ఎంపీడీవో, వెలుగు, ఉపాధి కార్యాలయాలకు వెళ్లే గ్రావెల్ రహదారి

**ఇంకొల్లు, న్యూస్‌టుడే:** ఇంకొల్లులోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి, గ్రామ పరిధిలోని చింతలపాలెం రోడ్డును అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీడీవో జి.శ్రీనివాసరావు తెలిపారు. ముప్పవరం రహదారిలో పెద్ద చెరువు కట్టపై 1987లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, వ్యవసాయ, ఆర్అండ్‌బీ, హౌసింగ్, ఎంపీడీవో, వెలుగు, పీఆర్ గెస్ట్‌హౌస్ నిర్మాణాలు జరిగాయి. కార్యాలయాల ఏర్పాటు జరిగి నాలుగు దశాబ్దాలు కావస్తున్నా నేటికి సరైన రహదారిలేదు. వర్షం కురిస్తే వాహనాలు కార్యాలయాల లోపలికి వెళ్లే వీలుండదు. నాలుగేళ్లకోసారి తాత్కాలికంగా మరమ్మతులు చేస్తుంటారు. కార్యాలయాల పరిసరాలు కనీస శుభ్రత కనిపించటం లేదు. ఇటీవల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు, కార్యదర్శితో కలిసి గ్రామంలో పర్యటించారు. ముప్పవరం రోడ్డు నుంచి పీఆర్ అతిథి గృహం వరకు, రెండో సచివాలయం నుంచి చింతలపాలెం వెళ్లే రహదారిలో విద్యుత్తు ఉప కేంద్రం వరకు సీసీ రహదారులు నిర్మించాలని నిర్ణయించారు. నవంబరు నెలాఖరుకు రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం



అద్దంకి: బీసీ బాలుర వసతిగృహం వద్ద మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషా

**అద్దంకి, న్యూస్‌టుడే:** చట్టాల గురించి ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సీఐ పి.కృష్ణయ్య అన్నారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా యువతకు పోలీసులపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఎస్సై ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

**ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే:** విద్యార్థులు చిన్నతనం నుంచి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీఐ కె.వెంకట్రావు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఏల్చూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై ఎం.పట్టాభిరామయ్య, ప్రధానోపాధ్యాయుడు బాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఇంకొల్లు, న్యూస్‌టుడే:** పోలీసు అమరవీరుల వారోత్సవాలు ఇంకొల్లులో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎస్సై సురేష్ స్థానిక విద్యాసంస్థల్లో సదస్సులు ఏర్పాటుచేసి పోలీసుల త్యాగనిరతి, పోలీసు శాఖ పనితీరు, పౌరుల బాధ్యత గురించి వివరించారు. ప్రధాన కూడళ్లలో పోలీసు అమరవీరుల బ్యానర్లు ఏర్పాటు చేయించారు. రక్షణ నిలయంలో అమరవీరులకు నివాళులర్పించారు.

**పర్చూరు (మార్టూరు):** గ్రామాల్లో శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీసులది సాహసోపేతమైన ప్రత్యేక పాత్ర అని ఎస్సై మాల్యాద్రి తెలిపారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పర్చూరులోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసుల త్యాగాలను తెరపై ప్రదర్శించారు.

## రైతుల సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



పి.గుడిపాడులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుబ్బారెడ్డి

**పి.గుడిపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే:** గ్రామాల్లో రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. కొరిశపాడు మండలం పి.గుడిపాడులో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రీ-సర్వేచేసిన సమయంలో రైతులకు ఏర్పడిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 243 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. రీసర్వే డీటీ రవికాంత్, ఆర్ఐ కృష్ణమోహన్, సర్వేయర్ మహేష్‌బాబు, కార్యదర్శి అజయ్‌బాబు, తెదేపా నేత కొట్టే రవీంద్ర పాల్గొన్నారు.

**రేణంగివరం(జే పంగులూరు), న్యూస్‌టుడే:** రీసర్వేలో దొర్లిన పొరపాట్లను సరిచేసుకునేందుకు గ్రామసభలను ఉపయోగించుకోవాలని తహసీల్దార్ పోపూరి సింగారావు అన్నారు. మండలంలోని రేణంగివరం సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. మొత్తం 15 మంది దరఖాస్తులు అందించగా అందులో భూమి కొలతలకు-4, సవరణలకు-4, సంయుక్త విచారణకు-4, ఫొటో, పేరు, కొనుగోలు మార్పునకు ఒక్కొక్కటి చొప్పున దరఖాస్తులు అందాయి. పంచాయతీ కార్యదర్శి ఎల్.సునీత, గ్రామపెద్ద బోరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు. ★ బల్లికురవ మండలం కూకట్లపల్లిలో జరిగిన గ్రామసభలో నిర్వహించారు.

**కారంచేడు, పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే:** రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో తలెత్తిన సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్లు బ్రహ్మయ్య, అనిత, ప్రశాంతి కోరారు. నియోజకవర్గంలోని దేవరపల్లి, కేశవరప్పాడు, కోలలపూడిలో మంగళవారం రైతుల నుంచి అర్జీలు సేకరించారు. సర్పంచులు సతీష్, సురేష్, ఎంపీటీసీ సభ్యులు రవిచంద్ర, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

### నేటి నుంచి గ్రామ సభలు

**ఇంకొల్లు:** మండలంలో నాలుగు రోజులపాటు రెవెన్యూ గ్రామసభలు జరుగుతాయని తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. గతంలో నిర్వహించిన గ్రామ సభల్లో పరిష్కారం కాని వినతులను మరోసారి అందజేస్తే పరిష్కరిస్తామన్నారు. ఈనెల 23న గంగవరం, 25న భీమవరం, నాగండ్ల, కొణికి గ్రామాల్లో సభలు ఉంటాయని చెప్పారు.



# అవీ ఇవీ

## క్రీడాకారులకు రోటరీ సభ్యుల సాయం

**చీరాల, న్యూస్‌టుడే:** దక్షిణ భారత అథ్లెటిక్స్ పోటీలలో సత్తాచాటి పతకాలు సాధించిన ఇద్దరు క్రీడాకారులకు రోటరీ క్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ఈసందర్భంగా మంగళవారం రోటరీ క్లబ్ భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్ మాట్లాడుతూ చీరాలకు చెందిన యశ్వంత్‌రాజ్, మహాలక్ష్మిలు జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించటం హర్షణీయమన్నారు. భువనేశ్వర్‌లో జరిగే అఖిలభారత స్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఎంపికైన వీరిని ప్రోత్సహిస్తు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు. అనేక మంది క్రీడాకారులను తయారుచేసిన శిక్షకుడు పులుగు శ్రీనివాసరెడ్డిని అభినందించారు. డాక్టర్ ఐ.బాబూరావు, డీవీ సురేష్, మామిడాల శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, ప్రసాద్ పాల్గొన్నారు.

## ఈపూరుపాలెం బాలికల ప్రతిభ

**చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే:** జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన ఈపూరుపాలెం జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు యాజమాన్య కమిటీ సభ్యులు మంగళవారం అభినందించారు. ఇటీవల బాపట్లలో సేవ్ గాళ్ చైల్డ్ అన్న అంశంపై వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మణిచందన (9వ తరగతి) వ్యాస రచనలో ద్వితీయ, తేజశ్రీ చిత్రలేఖనంలో తృతీయ స్థానంలో నిలిచారు. సోమవారం వీరు జిల్లా అధికారుల చేతుల మీదుగా నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసపత్రాలు అందుకున్నారు.

## మేదరమెట్లలో భగవద్గీత ప్రచారం

**మేదరమెట్ల, న్యూస్‌టుడే:** కొరిశపాడు మండలం మేదరమెట్ల, సోమవరప్పాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఘడియం పెద్దారెడ్డి, సభ్యులు రమేష్, రామయ్య, భాస్కర్‌రావు, పోతురాజు, వెంకయ్య పాల్గొన్నారు.

## కేంద్ర బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**చినగంజాం, న్యూస్‌టుడే:** ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలైన జన్‌ధన్, పీఎంఎస్‌బీవై వంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశపు భవనంలో ఐటీసీ, సెర్ప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎంపీడీవో అధ్యక్షతన క్లాప్ మిత్రలకు పథకంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈవోఆర్డీ సుబ్బారావు, ఐటీసీ, సెర్ప్ సంస్థల ప్రతినిధులు అరుణ్, సుమంత్ పాల్గొన్నారు.

## వెంకయ్య ఆశ్రమానికి వితరణ

**మార్టూరు, న్యూస్‌టుడే:** మార్టూరులో నూతనంగా నిర్మిస్తున్న వెంకయ్య ఆశ్రమానికి దాత బండారు వెంకటేశ్వర్లు, శివకుమారి దంపతులు రూ.10,116 విరాళాన్ని మంగళవారం అందజేసినట్లు ఆశ్రమ అధ్యక్షుడు తన్నీరు శివరాజేష్ తెలిపారు. అమ్మ ఆశ్రమంలో పై అంతస్తు భవన నిర్మాణానికి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావూల బాపయ్య, గుంటుపల్లి చంద్ భూమి పూజ నిర్వహించారు.

## నూతనంగా 36 మందికి ఆధార్ నమోదు

**రావినూతల (మేదరమెట్ల), న్యూస్‌టుడే:** కొరిశపాడు మండలం రావినూతలలోని సచివాలయం-1, 2లలో మంగళవారం ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశారు. దీనిలో 36 మందికి ఆధార్ కార్డులు అందించినట్లు ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. 23న పమిడిపాడు, రాచపూడి, తమ్మవరం, బొడ్డువానిపాలెం, 24న కొరిశపాడు, పి.గుడిపాడు గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పూనూరు వీఆర్ఏ ఆకస్మిక మృతికి నివాళి

**యద్దనపూడి, న్యూస్‌టుడే:** మండలంలోని పూనూరుకు చెందిన వీఆర్ఏ ఎం.సుబ్బారావు(84) అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ కె.రవికుమార్, డీటీలు విష్ణుప్రసాద్, మస్తాన్‌రావులు వీఆర్వే అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అశోక్‌లు హాజరై మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.

## బాబా ఆలయ వ్యవస్థాపకులు హఠాన్మరణం

**నక్కబొక్కలపాడు(అద్దంకి), న్యూస్‌టుడే:** బల్లికురవ మండలం నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన షిర్డీసాయిబాబా ఆలయ వ్యవస్థాపకులు, పూజారి డి.ప్రసాద్ (60) గుండెపోటుతో మంగళవారం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఆలయాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన ప్రసాద్ మృతికి పలువురు నివాళులు అర్పించారు.